క్లుప్తంగా

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడలపై ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించడమే లక్ష్యమని 'క్రీడా చేయూత' అధ్యక్షుడు అయిలూరి వెంకటేశ్వరెడ్డి, గూడురు కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. జిల్లాలోని పది పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశాక వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి.సత్తిరెడ్డి, శ్రీహరి, సుధాకర్, శ్యాంబాబు, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎండీ.గౌస్, ఎండీ. అక్బర్, ఆదర్శ్‌కుమార్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెంకు చెందిన రైతు పూజల సీతారాములు గురువారం పొలం వద్దకు వెళ్లగా పాము కాటేసింది. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు ఆయనను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు పొలాల వద్ద పనిచేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను, ఉపకార వేతనాలను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్ అన్నారు. గురువారం నగరంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలల తరబడి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మెస్‌చార్జీలను ప్రభుత్వం పెంచలేదని దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు సాగర్, భాను, ఉదయ్, భాస్కర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలి

నేలకొండపల్లి: పాలేరు నీటితో వెంటనే చెరువులు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో జీవాలతో పాటు, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సాగు నీరు లేక చేతికొచ్చిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీవాలు, ప్రజల గొంతులు తడిపేందుకు వెంటనే చెరువులు నింపాలని కోరారు.

1,134 మంది పట్టభద్రుల ఓటర్లు

కామేపల్లి : మండలంలో 1,134 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు కామేపల్లి తహసీల్దార్ సుధాకర్ గురువారం తెలిపారు. వీరిలో 724 మంది పురుషులు, 410 మంది స్త్రీ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఫ్యామిలీస్టార్
వినోద	టిల్లు 2
సాయిరాం	గాడ్జిల్లా కింగ్: ది న్యూ ఎంపైర్
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భరతనాట్యం

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	30		10
కాకర	36	చుక్కకూర	2
బీర	46		10
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
నాటుచిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

రాయితీ మర్చిపాయే..!

మున్సిపల్ బిల్ కలెక్టర్ల బాధ్యతా రాహిత్యం

- ఎర్లీ బర్డ్ ఆఫర్ ద్వారా వసూళ్లలో నిర్లక్ష్యం
- ఫలితంగా వంద శాతం పన్ను చెల్లిస్తున్న యజమానులు
- సిబ్బంది అవగాహన లేమితో అందని రాయితీ



కేఎంసీ కార్యాలయంలో పన్నులు చెల్లిస్తున్న నగరవాసులు



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పన్ను చెల్లింపుదారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో సిబ్బంది తీరుతో పన్ను చెల్లింపు దారులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను కూడా పొందలేకపోతున్నారు. ఆర్థిక సంవత్సరంలో ముందస్తుగా పన్నులు చెల్లించే వారికి ఏప్రిల్ నెలలో 5 శాతం ఆస్తి పన్నులు రాయితీ ఇస్తుంటారు. ప్రభుత్వం ఇచ్చే ఈ రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు అనేకమంది తమ ఆస్తి పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తారు. కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది చెల్లింపు దారుల నుంచి ఈ పన్నులను వసూలు చేయాల్సి ఉంటుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి యజమానుల నుంచి బిల్ కలెక్టర్లు ఈ పన్నులను వసూలు చేస్తున్నారు. పన్నుల వసూళ్ల కోసం అధికారులు కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

50,721 అసెస్‌మెంట్లకు రాయితీ..

2023–24 ఏడాదిలో వంద శాతం పన్నులు చెల్లించిన వారికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెలలో పన్నులు మొత్తం చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 50,721 అసెస్‌మెంట్లకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరంలో వంద శాతం పన్నులు చెల్లించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో ఒకేసారి పన్ను చెల్లిస్తే ఈ అసెస్‌మెంట్ యజమానులకు ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ ప్రయోజనం చేకూరనుంది. అధికారిక లెక్కల ప్రకారం 50,721 అసెస్‌మెంట్ల యజమానులు పన్నులు చెల్లిస్తే రూ.23.23 కోట్లు ఆదాయం ఈనెలలోనే కేఎంసీకి సమకూరనుంది.

అవగాహన రాహిత్యం..

కీలకమైన రెవెన్యూ సెక్షన్‌లో చురుకైన సిబ్బంది ఉండాలి. వీరు ప్రతిదీ లెక్కలు కట్టి పన్ను చెల్లింపుదారులకు ఎంత చెల్లించాలనేది వివరిస్తూ ఉండాలి. అయితే కార్పొరేషన్ కార్యాలయంలో మాత్రం బిల్ కలెక్టర్లు ఇందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరి తీరుతో పన్ను చెల్లింపుదారులు నష్టపోతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్‌లో పన్ను స్వీకరించే సమయంలో 5శాతం రాయితీ వర్తిస్తుందా లేదా..? పరిశీలించి ఇంటి యజమానికి సూచించి దానికి తగిన విధంగా నగదు తీసుకోవాల్సి ఉంది. కానీ బిల్ కలెక్టర్లు మాత్రం రాయితీ వర్తించే అసెస్‌మెంట్ల నుంచి కూడా 100 శాతం పన్ను వసూలు చేసి విమర్శలు ఎదుర్కొంటున్నారు.

అధికారుల వివరణ.. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. సిబ్బంది అవగాహన రాహిత్యంతో రాయితీ కల్పించలేకపోయామని, ఇకపై అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కె.అప్పారావు గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తి పన్ను చెల్లించేందుకు వచ్చారు. తన ఇంటి నంబర్ 5-11-86 పై పన్ను కట్టేందుకు వచ్చానని, ఎంత చెల్లించాలని కార్యాలయంలో ఉన్న సిబ్బందిని అడగగా సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి రూ.2,488లు ఉందని, ఈ నగదు మొత్తం చెల్లించాలని సూచించారు. ఇంత పన్ను వచ్చిందేంటని ప్రశ్నించినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెప్పినంత నగదును చెల్లించి రశీదు తీసుకున్నారు. తర్వాత కార్యాలయంలోని ఆర్ఓ గదికి వచ్చి అక్కడ ఉన్న సిబ్బందిని అడగగా 5 శాతం రాయితీ తీసేయలేదని తెలిపారు. ప్రతీ సంవత్సరం తాము ఏప్రిల్‌లో 5 శాతం రాయితీతో పన్ను చెల్లిస్తున్నామని, ఈ ఏడాది ఎందుకు ఇలా చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. సిబ్బంది నిర్వాకంతో తమకు వచ్చే రాయితీని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరితోపాటు మరో వ్యక్తి కూడా తనకు రాయితీ ఇవ్వలేదని అధికారుల వద్ద వాపోయాడు.



రాయితీ లేకుండానే చెల్లించిన పన్ను రశీదు

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంరూరల్: మరమ్మతుల కారణంగా ఏదులాపురం సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ క్రాంతిసింహ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వరంగల్ క్రాస్‌రోడ్, తల్లంపాడు అగ్రికల్చర్, మద్దులపల్లి లైటింగ్ ఫీడర్లు, లక్ష్మీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గుదిమళ్ల, వెంకటగిరి, తెల్దార్‌పల్లి, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు, ఏదులాపురం, పంచాయతీల పరిధిలోని వ్యవసాయ బావులకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల సబ్‌స్టేషన్ పరిధిలోగల బాసిత్‌నగర్, రేపల్లెవాడ, టేకులపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

'బార్' ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి

ఖమ్మంలీగల్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ హాల్‌లో ఉదయం 10.30గంటలకు మొదలయ్యే కార్యక్రమానికి న్యాయవాదులు హాజరు కావాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..



సైలెన్సర్లను తీయిస్తున్న ఏసీపీ



తొలగించిన సైలెన్సర్లు

- మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్
- శబ్దకాలుష్యం కలిగించే సైలెన్సర్లు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం క్రైం: ట్రాఫిక్ నిబంధనలు అతి క్రమింస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు మోడీఫైడ్ సైలెన్సర్లు అమర్చి వింత శబ్దాలు చేస్తున్న యువతపై సాక్షిలో బుధవారం ప్రచురితమైన 'సైరన్ సెగ' కథనానికి పోలీసులు స్పందించారు. సీపీ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వింత శబ్ధకాలుష్యం కలిగించే 79 సైలెన్సర్లు తొలగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ .. కొందరు యువత ద్విచక్రవాహనాలకే సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చుచేసి అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని, వీటి వల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడటంతో పాటు ప్రజలు భయభ్రాంతులు గురవుతున్నారన్నారు. రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మరి కొందరు వాహనాల హారన్లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలకు సిద్ధమయ్యామన్నారు. ధ్వని కాలుష్యాన్ని కలిగించే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసేకుంటామన్నారు. తొలగించిన సైలెన్సర్ల స్థానంలో ఆ సంస్థ ఇచ్చిన పొగగొట్టాలని అమర్చాలని సూచిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్ బాబు, ఎస్ఐ రవి, సాగర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్


రఘునాథపాలెం: గ్రామాల్లో ఇంటిపన్నులు వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా తక్కువ పన్నులు వసూళ్లపై గ్రామాలపై దృష్టి సారించారు. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరం రఘునాథపాలెం మండలంలో రూ.94లక్షల లక్ష్యానికి గాను రూ.64లక్షలే వసూలయ్యాయి. మార్చి నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగిసినా కొన్నిచోట్ల కార్యదర్శుల నిర్లక్ష్యం, ఇంకొన్ని చోట్ల యజమానుల పట్టింపులేని తనంతో ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ఏప్రిల్ నెలంతా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. మండలంలో 40 జీపీలకు గాను 30 పంచాయతీల్లో 70 శాతం పన్నులు వసూలు కాగా, రాంక్యాతండా, పాపటపల్లి, పంగిడి తదితర పంచాయతీలు బాగా వెనుకబడి ఉండడంతో అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 64శాతం వసూలు కాగా, ఈనెలలో వంద శాతం సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించారు.



వీ.వీ.పాలెంలో పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీనివాసరెడ్డి

ఓటుహక్కు వజ్రాయుధం..

ఖమ్మంరూరల్: ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు హక్కు వజ్రాయుధంలా పనిచేస్తుందని పాలేరు నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి అన్నారు. మండలంలోని పెద్దతండాలోని నర్సింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఓటరు నమోదు, సీ విజిల్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉందన్నారు. దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరి

బీమా పథకాలను వినియోగించుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

కామేపల్లి: బ్యాంకు ఖాతాదారులు బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ఆర్ఎం ఉదయ్ అన్నారు. మండలంలోని పండితాపురం ఏపీజీవీబీ బ్యాంకు ఖాతాదారురాలు దావత్ మంగమ్మ ఇటీవల మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును గురువారం మృతురాలి నామినికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ప్రతీ ఖాతాదారుడు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సత్కీర్తి, ప్రకాశ్, వరుణ్, జోగిరెడ్డి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం కనుల పండువగా జరిగింది. వేద పండితులు తీర్థం రామకృష్ణశర్మ, తుంగతుర్తి వీరభద్రప్రసాద్ శర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది భక్తులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్ని పూజలు చేశారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మికత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్ని పూజలు చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, నాయకులు ఏపూరి మహేందర్‌కుమార్, హేమమాలిని, నల్లమోతు లక్ష్మయ్య, ఆరెం రవి, దమ్మలపాటి సత్యనారాయణ, కోడెం సులోచన ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

నేలకొండపల్లి: మండలం లోని మంగాపురం తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కోట్యానాయక్ (75) గురువారం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, మార్తి కోటి, బొందయ్య, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్, సూరేపల్లి రవి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి సంతాపం....

కోట్యానాయక్ మృతికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపంను ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

మండలంలో ప్రసాద్‌రెడ్డి పర్యటన

ఖమ్మం రూరల్: మండలంలోని బారుగూడెం, గోళ్లపాడులో కంఠమహేశ్వరస్వామి ఆలయంలో యంత్ర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా గూడురుపాడు, జాన్‌బాద్‌తండాల్లో కూడా వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పెట్రోల్‌బంక్ ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు పాపాయిగూడెం క్రాస్‌రోడ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయిమధీన పెట్రోల్‌బంక్‌ని కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి ఎంపీపీ బోడ మంగీలాల్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, నాయకులు ఉన్నం రాజశేఖర్, విక్రమ్‌రెడ్డి, కిరణ్, మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలోని పలు వివాహ వేడుకల్లో పొంగులేటి ప్రసాదరెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. నాయకన్‌గూడెం, ముత్యాలగూడెం, పెరకసింగారం గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో గురువారం ఆర్‌సీఎం చర్చిలో జరిగిన వివాహ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై నూతన వధూవరులు కొమ్ము ముత్తయ్య మంజులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రజుమంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను నాయకులు నండ్ర ప్రసాద్, కొలిచలం స్వామి, నెర్సుల వెంకటేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిజ నిర్ధారణ కమిటీ వేయాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో జరిగిన భూ అక్రమణలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఖమ్మం పువ్వాడ ఉదయనగర్‌లో భూదందాలు చేసినట్లు వెలుగుచూసినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ పథకం ద్వారా జారీ చేసిన ఇళ్ల పట్టాల విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు మాయ చేశారని ఆరోపించారు. 2009లో తాడోజు నాగమణికి ఇందిరమ్మ ఇళ్ల పట్టా వస్తే.. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరు మార్చడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకులు ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు భూఆక్రమణలపై విచారణ జరిపించి దోషులను శిక్షించడంతో పాటు నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో భద్రూనాయక్, నజీమా, ఉపేంద్రాబాయి, రవీంద్ర నాయక్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ పి.సర్వేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. చిన్నపిల్లల మనసు ఎంతో సున్నితమైందని, విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందించాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి –త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు కాట్రగడ్డ మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాలకు హాజరైన ఎంపీ నామ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలో గురువారం జరిగిన పలు శుభకార్యాలకు ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరయ్యారు. 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి, సతీష్ కవిరాజ్‌నగర్‌లో నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలసి శుభాకాంక్షలు తెలిపారు. 15వ డివిజన్ అల్లీపురంలో కార్పొరేటర్ రావూరి కరుణ, సైదుబాబు గృహప్రవేశానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కిలారి రాంబాబు, బిక్కసాని జశ్వంత్, నాగేశ్వరరావు, సరిపూడి గోపి, చీకటి రాంబాబు, హరీశ్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

నేడు పీర్‌గైబ్‌షావలీ ఉర్సు మహోత్సవం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని శుక్రవారపేటలో అతి పురాతనమైన హజరత్ సయ్యద్ పీర్‌గైబ్ షావలీ దర్గా ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. 32ఏళ్లుగా ఇక్కడ నిర్వహిస్తున్న ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఏటా రంజాన్ మాసం 25వ రోజున ఈ వేడుకలు నిర్వహించనుండగా, ఈసారి శుక్రవారం జరిగే ఉర్సు ఉత్సవాలు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇస్లాం సంప్రదాయ పద్ధతిలో తరవీహ నమాజ్ అనంతరం తుమ్మలగడ్డలోని దర్గా సేవకుడు తాజ్‌బాబా ఇంటి నుండి గంధం, చాదర్, జెండాలు, పంఖా, బోడా, ఖందిల్‌తో బయలుదేరతారు. తుమ్మలగడ్డ మసీద్, మోమినాన్ స్కూల్, శుక్రవారపేట సెంటర్, రిక్కాబజార్ సెంటర్, శివాలయం మీదుగా దర్గాకు చేరుకోనుండగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తాజ్‌బాబా కోరారు.



శుక్రవారపేటలోని సయ్యద్ పీర్‌గైబ్ షావలీ దర్గా